www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 16 ఏప్రిల్ 2023

5

తూర్పుగోదావరి



పదో తరగతి పరీక్షలు ప్రశాంతం

ప్రజాశక్తి-చాగల్లు, దేవరపల్లి

పదో తరగతి సోషల్ పరీక్షకు శనివారం మూడు సెంటర్లో 425 మంది విద్యార్థులకు గాను 409 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఇఒ వి.ఖాదర్ బాబు తెలిపారు. చాగల్లు జిల్లా పరిషత్ పాఠశాలలో 183 మంది విద్యార్థులకుగాను ముగ్గురు గైర్హాజరయ్యారని, 180 మంది హాజరయ్యారని తెలిపారు. మార్కొండపాడు సెంటర్లో 110 మంది విద్యార్థులకు 104 మంది హాజరు కాగా ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని, ఊనగట్ల సెంటర్లో 132 మంది విద్యార్థులకు 125 మంది హాజరైనట్టు తెలిపారు. దేవరపల్లి మండలం యర్నగూడెం శ్రీ బొల్లిన గంగరాజు స్కూల్లో 241 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాశారు. ఉన్నత పాఠశాల, సెయింట్ జోసెఫ్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, త్యాజంపూడి జెడ్పి స్కూల్ విద్యార్థులు ఉత్సాహంగా పరీక్షల్లో పాల్గొన్నారు.

సంస్కరణోద్యమ ఖడ్గధారి కందుకూరి


- నేడు యుగపురుషుని జయంతి
- ప్రజా సంఘాల ఆధ్వర్యాన నృత్య రూపకం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

'కావ్యేషు నాటకం రమ్యం' అని భారతీయ సాహితీకారులు పేర్కొన్నా, 'ఈ ప్రపంచమే ఒక రంగస్థలం, స్త్రీ పురుషులందరూ పాత్రధారులు' అని ఆంగ్ల కవి షేక్స్పియర్ ప్రకటించినా, నాటకం ఒక విలక్షణ ప్రక్రియగా తన ప్రత్యేకతను, ప్రాభవాన్ని నేటికీ కోల్పోలేదు. ఒకనాడు సమాజ చైత న్యానికి ఊపిరులూదిన నాటకరంగం తరువాత సినిమాల ప్రాచుర్యంతో కాస్త మసకబారినా, నేటికీ తన ఉనికిని కాపాడుకుంటోంది. సామాజిక చైతన్యానికి, పురాణ సాహిత్యంపై సామాన్య ప్రజలకు ఆసక్తి కలిగించడానికి నాటక రంగం దష్టి సారించింది. రాజమహేంద్రవరం కేంద్రంగా యుగపురుషుడు కందుకూరి వీరేశలింగం రచించిన తొలి ప్రదర్శిత నాటకం 'వ్యవహార ధర్మ 'బోధిని' నాడు సంచలనం రేపింది. సామాజిక రుగ్మతలపై కందుకూరి సంధించిన మరో అస్త్రం బ్రాహ్మ వివాహం చాందసవాదులను కలవరపెట్టింది.

నాటకం.... నడక నేర్చింది ఇక్కడే..!

కందుకూరి వీరేశలింగం.. సాంఘిక దురాచారాల పీచమణచడంలో వీరోచితంగా పోరాడిన వ్యక్తి. హితకారిణి సమాజమే ఆలంబనగా ఎందరో ఆపన్నులకు కొత్త జీవితాన్ని ప్రసాదించారు. 'వివేక వర్ధని'తో పాత్రికేయానికి మేలిమి అద్దారు. తాను నమ్మిన విలువల కోసం.. తాను కలలు కన్న సమాజాన్ని సష్టించడం కోసం. తన యావదాస్తిని ఆయన ఫణంగా పెట్టాడు. ఇంత చేసిన ఆయనలో మరో కోణం ఉంది.. అదే అక్షరాన్ని పండిత పామరులకు చెంతకు తీసుకెళ్లే వైవిధ్య సాహితీ వ్యాసాంగం ఆయన సొంతం.. ఎన్నో సరికొత్త నాటక రచనలు ఆయన కలం నుంచి జాలువారాయి.. అందుకే కందుకూరి జయంతిని రాష్ట్ర రంగస్థల దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించింది.. నేడు ఆ మహానుభావుని జయంతి. ఈ సందర్భంగా నాటక రంగంలో ఆయన చేసిన కృషిని ఒకసారి స్మరిద్దాం..



తొలి తెలుగు నాటకంగా...

నాటక రంగానికి నిజానికి గోదావరి నీరే ఊపిరిలూదింది. ఒకప్పుడు నాటకమే చైతన్యానికి మూలస్తంభంగా నిలిచింది ఇప్పుడు ఆ కళ పోయింది. మహామహులైన కందుకూరి వీరేశలింగం, టంగుటూరి ప్రకాశం, చిలకమర్తి లక్ష్మీనరసింహం, వడ్డాది సుబ్బారాయుడు, దొమ్మేటి సూర్యనారాయణ, గరికపాటి రాజారావు లాంటి వారు ఎందరో ఇక్కడ నుంచే నాటక రంగాన్ని, నాటకాలను ప్రోత్సహిస్తూ సామాజిక చైతన్యానికి నాంది పలికారు. ఇక్కడ రచించిన నాటికల్లో రంగూన్ రౌడీ, గుడి ఎనక నా సామి, పాలేరు వంటి వాటి నాటికలు ఆంధ్రప్రదేశ్‌లో కళారంగాన్ని ఉర్రూతలూగించాయి. రానురాను ఈ కళకు ఆదరణ తగ్గటంతోనూ ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవటంతోనూ కళాకారులు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు.

చైతన్యానికి ప్రతీక 'పాలేరు'

ఇక్కడే ఊపిరి పోసుకుని ఉభయ గోదావరి జిల్లాల్లో అత్యంత ప్రాముఖ్యత సంతరించుకున్న నాటికల్లో ప్రధానమైనది పాలేరు నాటిక. ఈ నాటికలోని సారాంశాన్ని స్ఫూర్తిగా తీసువని ఉభయ గోదావరి జిల్లాల్లో నిమ్న వర్గాల యువకులు ఎంతోమంది ఐఎఎస్, ఐపిఎస్, ఐఆర్ఎస్ అధికారులుగా తయారయ్యారంటే అతిశయోక్తి కాదు. జిల్లాలోని మామిడికుదురుకు చెందిన ప్రసిద్ధ రచయిత బోయి భీమన్న 1940 దశకంలో పాలేరు నాటకాన్ని రచించి ప్రదర్శన ద్వారా, రాష్ట్రంలోనూ, దేశంలోలోనూ పలు ప్రాంతాల్లోని ప్రజల్లో చైతన్యాన్ని నింపారు. అప్పుల్లో సమాజాన్ని వేధిస్తున్న భూస్వామ్య కామాందులకు వ్యతిరేకంగా ఈ నాటకాన్ని భీమన్న రాశారు. భూస్వాములు పాలేరులను బానిసలుగా చూడటం, వారిని హింసించటంతో పాటు పాలేర్లు అనుభవిస్తున్న దుర్భర జీవితాలు ఎలా ఉంటాయో కళ్లకు అద్దినట్లుగా నాటికను రచించారు. ఈ నాటికను చూసిన యువతలో రక్తం ఉప్పొంగింది. అదే ఆలంబనగా వారంతా ఉన్నత చదువులు అభ్యసించి సమాజంలో ఉన్నతాధికారులుగా అభివృద్ధి చెందారు.

నేడు నృత్య రూపకం

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నేడు కందుకూరి వీరేశలింగం జీవితంపై నృత్య రూపకం ప్రదర్శించనున్నారు. కందుకూరి 175వ జయంతి పురస్కరించుకుని సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ రాజమహేంద్రవరం, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక, విద్యార్థి, యువజన, మహిళా ఉపాధ్యాయ, కార్మిక ఎసంఘాలు నిర్వహణ కమిటీగా ఏర్పడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. నేడు సాయంత్రం 5 గంటలకు ఆనం కళాకేంద్రంలో సంగీత నృత్య రూపకం ప్రారంభం కానుంది. నగర వాసులు, విద్యా వంతులు, మేధావులు ప్రజానీకం, విద్యార్థులు, కళాభిమానులు, సాహితీ వేత్తలు పాల్గొనాలని నిర్వహణ కమిటీ విజ్ఞప్తి చేస్తోంది.

జిల్లాలో 233 ధాన్యం సేకరణ కేంద్రాలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

జిల్లాలో మొత్తం 233 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో రబీ సీజన్లో సాగు చేసిన రైతులు ధాన్యం అమ్ముకునేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రంలో షెడ్యూలింగ్ చేసుకోవచ్చని తేజ్ భరత్ తెలిపారు.

జిల్లాలో మొత్తం 233 ఆర్‌బికె కేంద్రాలను ధాన్యం కొనుగోలు నిమిత్తం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలాలు వారీగా ధాన్యం కొనుగోలు కేంద్రాలె అనపర్తిలో 10, బిక్కవోలులో 13, గోకవరంలో 13, కడియంలో 8, కోరుకొండలో 17, రాజమహేంద్రవరం రూరల్‌లో 3, రాజానగరంలో 18, రంగంపేటలో 8, సీతానగరంలో 10, చాగల్లులో 16, దేవరపల్లిలో 15, గోపాలపురంలో 7, కొవ్వూరులో 15, నల్లజర్లలో 12, నిడదవోలులో 22, పెరవలిలో 15, తాళ్ళపూడిలో 13, ఉండ్రాజవరంలో 18 కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. రైతులు వారి పరిధిలోని ఆర్‌బికె పనివేళల్లో వారి యొక్క ధాన్యం సాంపిల్స్‌ను టెక్నికల్ అసిస్టెంట్ లేదా గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా షెడ్యూలింగ్ చేయించుకోవాలని సూచించారు. కేవలం ఆన్‌లైన్ విధానం ద్వారా, ఇ-క్రాప్‌లో నమోదు చేసుకుని ఇకెవైసి చేయించుకున్న రైతులకు మాత్రమే ఈ అవకాశం ఉందన్నారు. ధాన్యం తేమ 17 శాతం ఉండేటట్టుగా చూసుకోవాలని తెలిపారు. షెడ్యూలింగ్ చేసుకున్న రైతులకు గన్నీ బ్యాగులు, లేబర్, రవాణాకు సంబంధించి రైతులు స్వంత ఖర్చులు ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా చెల్లిస్తారని తెలిపారు.

జిల్లాకులో ప్రస్తుత రబీ సీజన్‌లో 2,50,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్ణయించామన్నారు. సన్నకారు, చిన్నకారు రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా పూర్తి కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) పొందవచ్చని జెసి తెలిపారు. మిగిలిన రైతులకు వారు వేసిన పంట వెరైటీకి ప్రభుత్వం నిర్ధారించిన ఎంఎస్‌పి ధరకు తగ్గకుండా బహిరంగ మార్కెట్లో కూడా అమ్ముకునే విధంగా చర్యలు తీసుకోవడానికి మండల వ్యవసాయ అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు. గ్రామ స్థాయి అధికారులు గ్రామ వ్యవసాయ సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లకు రెండుసార్లు శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కంట్రోల్ రూమ్ 8309487151 (మొబైల్ వాట్సాప్) 0883-2940788 (ల్యాండ్, నెంబర్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడి

ప్రజాశక్తి-గోపాలపురం

ప్రతి ఒక్క రైతు తప్పనిసరిగా భూసార పరీక్ష చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.రాజారావు తెలిపారు. శనివారం మండల కార్యాలయంలో గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, మండల వ్యవసాయ సలహా మండలి సభ్యులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పండించే పంటకు ఎంత పెట్టుబడి పెట్టినా భూమిలో సారం లేనప్పుడు అనుకున్న రీతిలో దిగుబడి పొందే అవకాశం ఉండదని, భూసార పరీక్షతో దిగుబడుల సాధనకు చర్యలు తీసుకోవచ్చని చెప్పారు. మూడేళ్లకోసారి ఈ ప్రక్రియ కొనసాగిస్తే సరిపోతుందని తెలిపారు. ఈ వేసవికాలంలో భూసార పరీక్షలకు సంబంధించి మట్టి నమూనాలు సేకరణ, భూసార పరీక్ష ఆవశ్యకత గురించి వివరించారు. ఎకరంలో ఐదు నుంచి ఆరు చోట్ల మట్టి నమూనాలు సేకరించాలన్నారు. ఆ సేకరణ కూడా 6 అంగుళాల లోతు వరకు మట్టిని తవ్వి అంచుల వెంబడి ఉన్న మట్టిని తీసుకోవాలన్నారు. ఇలా సేకరించిన రెండు నుంచి మూడు కేజీల మట్టిని నీడకు తీసుకురావాలన్నారు. బాగా పొడిచేసి బాగా కలియబెట్టి కోటరింగ్ పద్ధతిలో ఎదురెదురు భాగాలు తీసివేస్తూ అరకేజీ మట్టి వచ్చేలా చూసుకోవాలని సూచించారు. దాన్ని ఒక పాలిథిన్ కవర్లో ఉంచి దానికి తోడుగా రైతు వివరాలు సేకరించి అప్పుడు భూసార పరీక్షా కేంద్రానికి పరీక్ష నిమిత్తం పంపాల్సి ఉంటుందని తెలిపారు. భూసార పరీక్ష కేంద్రం సిబ్బంది రాబోయే సీజన్లో పంటలకు అవసరమైన ఎరువులు మోతాదును సూచిస్తారని తెలిపారు. దానిని అనుసరించి ఎరువులను వినియోగించడం వల్ల తక్కువ ఖర్చుతో అధిక ఆదాయమును పొందవచ్చని చెప్పారు. రసాయనాలు లేని పంట ఉత్పత్తిని పొందవచ్చని తెలిపారు. శిక్షణ అనంతరం జిల్లా వ్యవసాయ సలహా మండలి గోపాలపురం నియోజకవర్గ కన్వీనర్ కూసం రామ మోహన్ రెడ్డి పొలంలో ప్రత్యక్షంగా మట్టి నమూనా ఏ విధంగా సేకరించాలి అనే విషయాన్ని సిబ్బందికి వివరించారు.

పంచాయతీల స్టాంప్ డ్యూటీ విడుదల చెయ్యాలి

ప్రజాశక్తి-కడియం

పంచాయతీల స్టాంప్ డ్యూటీ విడుదల చేయాలని మండలంలోని జేగురుపాడు సర్పంచ్ వై.స్టాలిన్ శనివారం రాజానగరం ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా, వైసిపి రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. గ్రామ పంచాయతీలకు రావాల్సిన స్టాంప్ డ్యూటీ వాటా సుమారు 15 నెలలు నుంచి రాలేదని, సబ్ రిస్ట్రార్ ఆఫీసుల నుంచి ట్రెజరీ ఆఫీసులకు పంపించివేశామని చెబుతున్నట్టు తెలిపారు. సంబంధిత సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు అధికారులకు చెప్పినా నిధులు విడుదల చేయడంలో జాప్యం జరుగుతుతోందన్నారు. పంచాయతీల సిబ్బందికి జీతభత్యాలకు కూడా నిధుల్లే సర్పంచులు గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించలేకపోతున్నారని , వెంటనే ఈ విషయం పైన దష్టి పెట్టి అధికారులతో మాట్లాడి గ్రామ పంచాయితీలను ఆదుకోవాలని స్టాలిన్ కోరారు. దీనిపై ఎంఎల్‌ఎ రాజా, నాగేశ్వర్ వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ఆర్‌బికెల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు

జిల్లావ్యాప్తంగా రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిని పలువురు అధికారులు శనివారం తనిఖీ చేశారు.

ప్రజాశక్తి-యంత్రాగం

తాళ్లపూడి మండలంలోని 13 ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు చేయనున్నట్టు తహశీల్దారు టి.రాధిక తెలిపారు. అన్నదేవరపేటలో ఆర్‌బికె కేంద్రాలను ఆమె శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ 13 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తనకు నాలుగు, వ్యవసాయ శాఖ అధికారికి ఐదు, ఎంపిడిఒకు నాలుగు కేంద్రాలు కేటాయించినట్టు తెలిపారు. క్వింటాలుకు రూ.2,040కు కొనుగోలు చేస్తారని తెలిపారు. ధాన్యం అమ్మకం విషయంలో అనుమానాల నివత్తికి మండల కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని ఎంపిడిఒ ఎం.రాజశేఖర్ తెలిపారు. **చాగల్లుబ** మండలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తహశీల్దారు కె.రాజ్యలక్ష్మి తెలిపారు. ధాన్యం కొనుగోలుకు సంభందించి రైతులు ఆయా గ్రామాల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను సంప్రదించి పేర్లు నమోదు చేసుకుని పండించిన ధాన్యం నమూనాలను చూపించాలని ఆమె కోరారు. అనంతరం సమీప రైస్ మిల్లర్లకు పండించిన ధాన్యాన్ని తరలించేందుకు సిబ్బంది అన్ని ఏర్పాట్లూ చేస్తారని తహశీల్దారు తెలిపారు. ఏమైనా ఇబ్బందులు ఎదురైతే జి.రమాదేవి 6281215578, కె.దుర్గ 6301473256లను సంప్రదించాలని తహసిల్దార్ తెలిపారు. **కడియం** రైతుల నుంచి ధాన్యం సేకరణ సక్రమంగా చేపట్టాలని కడియం ఎంపిడిఒ కె.రత్నకుమారి సూచించారు. వేమగిరి రైతు భరోసా కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. మొత్తం 330 ఎకరాలు ఈ క్రాప్ బుకింగ్ జరిగిందని వారు వివరించారు. 20,365 సంచులు అవసరం ఉంటాయని , ఇప్పటి వరకు కడియం నుంచి 400, కోరుకొండ నుంచి 2500 సంచులు రైతు భరోసా కేంద్రానికి చేరినట్లు వారు తెలిపారు. ఈ గ్రామ పరిధిలో 330 ఎకరాల్లో 1121 రకం వరి సాగు చేసినట్లు ఎంపిడిఒకు వివరించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఏ సమస్య వచ్చిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, రైతులను ఇబ్బంది పెట్టవద్దని ఎంపిడిఒ సూచించారు.

ప్రభుత్వాసుపత్రి ప్రహరీ నిర్మించాలి

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు మండల కేంద్రం ప్రభుత్వాసుపత్రిలో సుమారు మూడెకరాల విస్తీర్ణంలో ఉన్న ఆసుపత్రిలో ఎకరం భూమిలో ఆసుపత్రి నిర్మాణం చేపట్టారు. మిగిలిన ఎకరాన్న భూమిలో జామాయిల్ తోట ఉంది. ఆసుపత్రి దక్షిణ వైపు ప్రహరీ గోడ పడిపోవడంతో ఎవరైనా జామాయిల్ చెట్లు నరుక్కుపోతారేమోనని స్థానికులు అనుకుంటున్నారు. కావున అధికారులు ఆసుపత్రిని అభివద్ధి చేయటంతో పాటు ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని విలువైన జామాయిల్ చెట్లు కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

లక్ష గోనె సంచులు సిద్ధం

ప్రజాశక్తి-చాగల్లు

ధాన్యం కొనుగోళ్ల ప్రారంభమైన నేపథ్యంలో 16 రైతు భరోసా కేంద్రాల్లో లక్ష గోనె సంచులు అందుబాటులో ఉన్నట్టు మండల వ్యవసాయ శాఖ అధికారు కె.వేణుగోపాలకష్ణ తెలిపారు. వరి కోత కోసి ధాన్యం ఆరబెట్టి 17 శాతం తేమ శాతం ఉండి అమ్మకానికి సిద్ధంగా ఉన్న రైతులకు వీటిని పంపిణీ చేస్తామని చెప్పారు. తహశీల్దారు కె.రాజ్యలక్ష్మి, ఎంపిడిఒ బి.రామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో ఆర్‌బికెల్లో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన యంత్ర పరికరాలను తనిఖీ చేసినట్టు తెలిపారు.

తిరుమలశెట్టి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-కడియం

ఇటీవల మరణించిన కడియపులంక గ్రామానికి చెందిన తిరుమలశెట్టి వెంకన్న కుటుంబసభ్యులను వైసిపి రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకన్న తండ్రి తిరుమలశెట్టి కొండయ్యను ఓదార్చారు. తొలుత వెంకన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో సొసైటీ చైర్మన్ తిరుమలశెట్టి శ్రీనివాస్, బోడపాటి మూర్తి, మండేల బంగారయ్య, అడ్డగళ్ళ రమేష్ తదితరులున్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు'కు పెద్ద స్పందన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

2024 సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి వైసిపి అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా ధీమా వ్యక్తం చేశారు. జగనన్నే మా భవిష్యత్తు పేరిట రాష్ట్రంలో వారం రోజుల క్రితం ప్రారంభించిన పీపుల్స్ సర్వేలో జగన్మోహన్ రెడ్డి పాలనపై ప్రజల నుంచి అనూహ్యమైన సంతప్తి వ్యక్తమవుతుండటం ఇందుకు కారణమన్నారు. శనివారం పార్టీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వరరావు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జక్కంపూడి రాజా మాట్లాడారు. రాష్ట్రంలోని 1.4 కోట్ల గహాలను సందర్శించి, తమ ప్రభుత్వ పాలన నచ్చిందా లేదా అనే విషయాన్ని ప్రశ్నల రూపంలో తెలుసుకోవడానికి నిర్వహిస్తున్న పీపుల్స్ సర్వేకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. గత టిడిపి ప్రభుత్వ పాలన, తమ ప్రభుత్వ పాలన తేడాలను వివరించి, జగనన్న పాలన నచ్చితే వారి సెల్ ఫోన్ నుంచి మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరుతున్నామని చెప్పారు. ఇప్పటివరకు 64 లక్షల 19 వేల 134 మిస్డ్ కాల్స్ ప్రజల నుంచి వచ్చాయన్నారు. ఈ కార్యక్రమం ప్రారంభించిన సగం రోజులకే దాదాపు రాష్ట్రం లోని 50 శాతం గహస్తుల నుంచి పరిపాలన నచ్చినట్టు మిస్డ్ కాల్స్ రూపంలో స్పందన లభించడం అపూర్వమన్నారు. రాష్ట్రంలో ఏ పార్టీకి లేనంత యంత్రాంగం తమకు ఉందన్నారు. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఒక పిలుపు ఇస్తే లోక్ సభ సభ్యులు, శాసనసభ్యులు, పార్టీ సమన్వయకర్తలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కన్వీనర్లు, గృహసారథుల ఆధ్వర్యంలో వాలంటీర్ క్లస్టర్ పరిధిలోని 50 గహాలకు చేరిపోయే యంత్రాంగం తమకు ఉందన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి వస్తున్న స్పందనతో పార్టీ యంత్రాంగం రానున్న రోజుల్లో రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తోందని ఎంఎల్‌ఎ రాజా పేర్కొన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పాలన, అందిస్తున్న పథకాల పట్ల ప్రజల నుంచి సంతప్తి వ్యక్తమవుతుంటే



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ రాజా

విపక్ష నేత చంద్రబాబు అబద్ధపు ఆరోపణలతో బురదచల్లే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అనపర్తి ఎంఎల్‌ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్ల పూర్తయిన తర్వాత కూడా ప్రజా ప్రతినిధులు ప్రజల్లోకి ధైర్యంగా వెళుతున్నారంటే అందుకు గల కారణం సిఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే కుల మతాలకు అతీతంగా జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న పాలన పట్ల ప్రతి ఒక్కరు ఎంతో సంతోషంగా ఉన్నారని, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ద్వారా తమకు అనూహ్యమైన స్పందన వచ్చిందన్నారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించడంలో తమ ప్రతినిధుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా వాలంటరీ వ్యవస్థ ద్వారా మాత్రమే ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తునరన్నారు. ఈ కార్యక్రమంలో ఖాదీ బోర్డు వైస్ చైర్మన్ పిల్లి నిర్మల, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు గిరిజాల బాబు, మిండి నాగేంద్ర, స్టాలిన్, జెసిఎస్ కన్వీనర్లు రాజమౌళి విష్ణుమూర్తి పాల్గొన్నారు.

యుటిఎఫ్ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

యుటిఎఫ్ బలోపేతానికి కృషి చేయాలని పలువురు పిలుపు ఇచ్చారు. శనివారం మల్లిన వెంకట నరసమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంఘం మండల అధ్యక్షులు కె.వెంకటరత్నం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో శాఖల పనితీరును, పని విధానాన్ని, సంఘం బలోపేతానికి చేయాల్సిన పనులను చర్చించారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఐ.రాంబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ సమావేశంలో మోర్త ఉన్నత పాఠశాల అధ్యక్షులు బి.మురళీమోహన్, కార్యదర్శి జి.అజూభ, తాడిపర్రు ఉన్నత పాఠశాల కార్యదర్శి ఎస్‌కె.మీరా సాహెబ్, వేలివెన్ను ఉన్నత పాఠశాల నుంచి అధ్యక్షుడు పి.వెంకటేశ్వర్లు, శివశంకర్, జివివిఎస్ శివప్రసాద్, సత్యవాడ ఉన్నత పాఠశాల అధ్యక్షులు వరప్రసాద్, వడ్లూరు ఉన్నత పాఠశాల కార్యదర్శి ఎన్.ఝాన్సీలక్ష్మి, ఉండ్రాజవరం నుంచి పిఎస్‌బి.సుబ్రమణ్యం, కాంతారావు, ఆర్‌ఎస్‌ఆర్ ఫణి హాజరయ్యారు.

మండలానికి రెండు 98-డిఎస్‌సి పోస్టులు

ప్రజాశక్తి - చాగల్లు

98-డిఎస్‌సి బ్యాచ్ నుంచి చాగల్లు మండలానికి రెండు పోస్టులు మంజూరైనట్టు ఎంఇఒ వి.ఖాదర్ బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలో 98-డిఎస్‌సిలో 285 మందికి పోస్టులు మంజూరయ్యాయని తెలిపారు. వాటిలో చాగల్లు మండలానికి రెండు పోస్టులకు గాను బిసి కాలనీ-1, ఊనగట్ల స్పెషల్-1 నియామక పత్రాలు ఇచ్చినట్లు తెలిపారు.

కార్టూ'నిజం'



మళ్లీ పాత పాటే పాడిన.. మోడీ ప్రభుత్వం..!!

అంబేద్కర్ జయంతి ర్యాలీలో వివాదం

వేగేశ్వరపురంలో ఉద్రిక్తత

ప్రజాశక్తి-తాళ్లపూడి

అంబేద్కర్ జయంతి సందర్భంగా మండలంలోని వేగేశ్వరపురంలో డిజె సౌండ్‌లతో శుక్రవారం రాత్రి జరిగిన ఊరేగింపులో రెండు సామాజిక వర్గాల మధ్య వివాదం జరిగి ఉద్రిక్తతలకు దారితీసింది. గ్రామంలో నవచైతన్య యూత్ ర్యాలీ నిర్వహిస్తూ రామాలయం వద్ద చేరిన తర్వాత యువకుల మధ్య వివాదం జరిగింది. ఈ ఈ సమయంలో ఒక సామాజిక వర్గానికి చెందిన యువకుల తలలపై గాయాలు తగిలాయని అంటుండగా మరొక వర్గం వారు తమను కించపరిచారని ఆరోపిస్తూ నినాదాలు చేస్తూ గ్రామంలోని అన్ని వీధులూ కలిగి తిరిగారు. రాత్రి సమయంలో జరిగిన ఈ సంఘటన గ్రామంలో ఆందోళన కలిగించింది. పరిస్థితి అదుపు తప్పే అవకాశం ఉందని భావించిన పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి కొనసాగింది. ముందు జాగ్రత్తగా కొవ్వూరు నుంచి పోలీసు బలగాలు గ్రామానికి వచ్చాయి. శనివారం గ్రామంలోని రెండు ప్రాంతాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. పెట్టావారి రామాలయం వద్ద, మెయిన్ రోడ్డులోనిఅంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం అర్ధరాత్రి నుండి శనివారం సాయంత్రం వరకు పోలీస్ పహారా కొనసాగింది. రెండు గ్రూపుల మధ్య జరిగిన ఈ వివాదంలో తమ వాహనాలపై దాడి చేయడంతో పాటు కర్రలతో కొట్టారని కొందరు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. తమ వారిపై దాడి చేశారంటూ ఒక సామాజిక తరగతికి చెందిన మహిళలు సైతం ఆందోళనలకు దిగారు. కొవ్వూరు డిఎస్‌పి వర్మ, ముగ్గురు సిఐలు, ఎస్‌ఐల ఆధ్వర్యాన పోలీసులు సిబ్బంది గ్రామంలో హోహరించారు. ఒక సామాజిక తరతగికి చెందిన వారి ఫిర్యాదు మేరకు మరో సామాజిక తరగతికి చెందిన 9 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిసింది. మరో సామాజికి తరగతికి చెందిన వారు శనివారం రాత్రి తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. తమ గ్రహాలపై దాడి చేసి ధ్వంసం చేయడమే కాక స్కూటర్లను పాడుచేసి ఆ ప్రాంతంలో బీభత్సం సష్టించి తమ పైనే కేసులు పెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై పలువురు కొవ్వూరు సిఐ రమణ కు ఫిర్యాదు చేశారు.



గ్రామంలో కొనసాగుతున్న పోలీస్ పికెట్

'మెహరా'లో విలువలతో కూడిన విద్య

ప్రజాశక్తి-గోపాలపురం

మెహరాశ్రీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో విలువలతో కూడా విద్య అందించడం అభినందనీయమని సర్పంచ్ మడిచర్ల ప్రసాద్, ఎఎంసి వైస్ చైర్మన్ తోట నాగేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని గుడ్డిగూడెంలో స్కూల్ 17వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. పిల్లల ఆట పాటలు, సాంస్కతిక నతాలు ఎంతగానో ఆకట్టుకున్నారు. పాఠశాల డైరెక్టర్ సుగ్గన బోయిన కష్ణ, కరస్పాండెంట్ మెహర జ్యోతి మాట్లాడుతూ గ్రామీణ మెట్ట ప్రాంతంలో 2006లో స్కూలు స్థాపించి అప్పటినుంచి సామాన్య, మధ్యతరగతి, ప్రతి ఒక్కరికి ఇంగ్లీష్ మీడియం స్కూలు అతి చేరువలో ఏర్పాటు చేశామన్నారు. అతి తక్కువ ఫీజులతో ఎందరో విద్యార్థులను విజ్ఞానవంతులుగా మేదవులుగా తయారు చేసినట్టు చెప్పారు. అప్పట్లో ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు వెళ్లాలంటే సుమారు 15 కిలోమీటర్లు దూరం వెళ్ళాలని, సామాన్య మధ్యతరగతి ప్రజలు, పిల్లల తల్లిదండ్రులు వ్యయ ప్రయాసలను దృష్టిలో ఉంచుకుని ఇంగ్లీష్ మీడియం స్కూలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అప్పటినుంచి అతి తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యా బోధన, ఆటపాటలతో, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను పిల్లలకు అందిస్తున్నట్టు చెప్పారు. ఈ స్కూల్లో యుకెజి నుంచి 7 తరగతి వరకు విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పాఠశాలలో చదివిన ఎందరో విద్యార్థులు ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని, ఎందరినో విద్యావంతులుగా మేధావులుగా తీర్చిదిద్దామని సంతప్తి వ్యక్తం చేశారు. సర్పంచ్ ప్రసాద్, ఎఎంసి వైస్ చైర్మన్ నాగేశ్వరరావు, పిల్లల ఆటల పాటలను, సాంస్కతిక నత్యాలను తిలకించి అభినందించారు. అనంతరం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న బాలలు

నేరాలు ఘోరాలు

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మోటార్ సైకిల్ పై గంజాయి తరలిస్తున్న పూర్వ విద్యార్థిని ప్రత్తిపాడు ఎస్ఇబి అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు సిఐ అశోక్ తెలిపారు. కోనసీమ జిల్లా కొత్తపేట శతాబ్ది డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి దేగల సంజీవ్ తన యాక్టివా మోటార్ సైకిల్ పై లంబసింగి నుండి జాతీయ రహదారి మీదుగా గంజాయిని కొత్తపేట తరలిస్తుండగా ప్రత్తిపాడు వద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు. తాను ఈ గంజాయిని తన కళాశాల డిగ్రీ విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు తెలిపారన్నారు. పట్టుబడ్డ గంజాయి మూడు కిలోల వరకు ఉంటుందని దీని విలువ రూ.15 వేలు ఉంటుందని, వివిధచోట్ల విద్యార్థులకు విక్రయించడం వల్ల భారీ మొత్తంలో డబ్బులు వచ్చే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి మోటార్ సైకిల్ తో పాటు నిందితుడిని కోర్టుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

యువకుల మృతదేహాలు స్వాధీనం

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని కుళ్ళ వద్ద గోదావరి లో స్నానానికి దిగి గల్లంతయిన ఘటనలో ముగ్గురు యువకులు మృతి చెందారు. మునిగిన ప్రాంతం సమీపంలో 100 మీటర్ల పరిధిలో మృతదేహాలు లభ్యం అయ్యాయని ఎస్ఐ. చిరంజీవి చెప్పారు. గోదావరిలో స్నానానికి దిగి ముగ్గురు యువకులు గల్లంతైన విషయం విధితమే. ఈ సంఘటన కూళ్ల గ్రామం వద్ద చోటు చేసుకుంది. మృతులు కొప్పిసెట్టి సాయిరాం, పితాని రాజేంద్ర,మట్టపర్తి ఆనంద్ లు గా గుర్తించారు. మృత దేహాలను రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి పోస్టు మార్టం నిమిత్తం తరలించారు. సి.ఐ.దుర్గారావు పర్యవేక్షణ లో దర్యాప్తు చేస్తున్నారు.

బైకు నుంచి పడి యువకుని మృతి

ప్రజాశక్తి-రామచంద్రపురం

మండలంలోని ద్రాక్షారామ కోటిపల్లి రోడ్ లో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భీమ క్రాస్ పాలెం గ్రామానికి చెందిన పెనుమల్ల సాయికుమార్ రెడ్డి తన పల్సర్ బైక్ పై కోటిపల్లి వైపు వెళుతూ ద్రాక్షారామ వెంకటయ్యపాలెం మధ్యలో ఒక వ్యక్తి అడ్డు రావడంతో సడన్ బ్రేక్ వేశాడు. దీంతో బైక్ నుండి కింద పడిపోగా తలభాగానికి తీవ్రగాయమైనది. అక్కడికక్కడే మృతి చెందాడు ఇతనితోపాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. మృతదేహాన్ని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి తరలించి కేసు నమోదు చేసి ద్రాక్షారామ ఎస్ఐ బి.వినోద్ దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో పడి మహిళ మరణం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం రూరల్ మండలం కామనగరువు సమీపంలో శనివారం చల్లపల్లి ప్రధాన పంట కాలువలో పడి మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అమలాపురం మెట్ల కాలనీకి చెందిన సుంకర నాగమణి కి వివాహమై ఇద్దరు కుమారులు; ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమార్తె పుట్టిన తర్వాత తన భర్త చనిపోయాడు. అప్పటినుండి ఆమె మతిస్థిమితం లేదు. అమలాపురం సలాం మానసిక ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటుంది. శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఆమె కామనగరువు ఇరిగేషన్ కాలువలో పడి చనిపోయినట్టు ఆమె బంధువులు ఇచ్చిన ఫిర్యాదు రిపోర్ట్ పై ఎస్ ఐ ఆర్.గోపాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తేనెటీగల దాడిలో గీత కార్మికునికి గాయాలు

ప్రజాశక్తి - కాజులూరు

కల్లు తీసేందుకు తాడి చెట్టు ఎక్కిన గీత కార్మికుడు పిల్లి గోవిందు పై తేనెటీగలు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయని స్థానికులు, సర్పంచ్ గంజా దేవి సూరిబాబు తెలిపారు. శనివారం తాడి చెట్టు ఎక్కుతుండగా తేనెటీగలు దాడి చేయడంతో కిందకు దిగి పక్కనే ఉన్న పంటకాల్వ లోకి దూకేయడంతో ప్రాణాపాయం నుండి తప్పించుకున్నారు. సర్పంచ్, స్థానికులు దుగుదుర ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సోషల్ పరీక్షకు 15 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మండలంలోని 9 పరీక్ష కేంద్రాల్లో 10వ తరగతి సోషల్ పరీక్షకు శనివారం 15 మంది విద్యార్థులు హాజరుకాలేదని ఎంఇఒ శివరామకృష్ణయ్య తెలిపారు. మొత్తం 1620 మంది విద్యార్థులకు గాను 1605 మంది హాజరుకాగా, 15 మంది హాజరుకాలేదని వివరించారు. మండలంలోని ఉండూరు జడ్పి హైస్కూల్లో పరీక్ష కేంద్రంను స్క్వాడ్ ఆఫీసరు కుర్మారావు తనిఖీలు చేసి పరిశీలించారు. సామర్లకోట జెడ్పి బాలికోన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రంను తాను పరిశీలించినట్లు ఎంఇఒ శివరామకృష్ణయ్య తెలిపారు. దాదాపుగా టెన్త్ మేజర్ సబ్జెక్టులు పూర్తికాగా ఈ నెల 17,18 తేదీల్లో వోకేషనల్ సబ్జెక్టులకు పరీక్షలు ఉంటాయన్నారు. సోషల్ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందన్నారు.

వెదురుమూడిలో పూలే విగ్రహం ఏర్పాటు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

వెదురుమూడిలో ఏర్పాటు చేసిన జ్యోతి రావ్ పూలే విగ్రహాన్ని ప్రభుత్వ స్థలంలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేశారంటూ తొలగించిన విగ్రహాన్ని ఎట్ట కేలకు శుక్రవారం రాత్రి యథాస్థానంలో నెలకొల్పారు. ఎంఎల్సి తోట త్రిమూర్తులు, కుడుపూడి సూర్యనారాయణ, స్థానిక పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ శెట్టిబలిజలతో శుక్రవారం రాత్రి జరిగిన చర్చలు ఫలప్రదం కావడంతో పూలే విగ్రహావిష్కరణ జరిగింది. కాగా 54 మంది పైపెట్టిన కేసులు ఎత్తి వేయించడంలో కృషి చేస్తానని ఎంఎల్సీ తోట త్రిమూర్తులు హామీ ఇచ్చారు. శనివారం తాత పూడిలో ఎంఎల్ఏ వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ ఎట్టకేలకు విగ్రహం ఏర్పాటు చేయడం బీసీల విజయమంటూ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

యానాం వార్తలు


సేవలందించిన సమతా సైనిక్ దళ్ సభ్యులు

అంబేద్కర్ జన్మస్థలంలో సమతా సైనిక్ దళ్ సేవలు

ప్రజాశక్తి - యానాం

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జన్మస్థలమైన మధ్యప్రదేశ్ లోని ఇండోర్ జిల్లా మౌ పట్టణంలో జరిగిన జయంతి వేడుకల్లో కవాతు నిర్వహించి, సందర్శకులకు రెండు రోజుల పాటు సేవలు అందించినట్లు ఎపి, యానాం సమతా సైనిక్ దళ్ ఛీఫ్ కమాండర్ బత్తుల జాగత్ కుమార్ తెలిపారు. ఎవిఆర్, ముగ్రే మీరాసాహెబ్, కొల్లా బత్తుల ప్రసాద్, పెయ్యల దుర్గా ప్రసాద్, గెడ్డం శ్రీను, బొంతు రాజేంద్ర, అల్లంపల్లి సత్యనారాయణ, వరసాల దుర్గా ప్రసాద్, పిల్లి ప్రసాద్, బూసి ప్రవీణ్, చొక్కా నాగరాజు పాల్గొన్నారన్నారు.


జగన్నాథరావు విగ్రహంవద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

జగన్నాథరావుకు నివాళి

ఫ్రెంచ్ కాలంలో మేయర్ గా పనిచేసిన స్వాతంత్ర సమరయోధుడు యర్రా జగన్నాధ రావు వర్ధంతి సందర్భంగా శనివారం యానాంలో సమాచార శాఖ అధ్వర్యంలో స్థానిక ఫెర్రీ రోడ్డులోగల ఆయన విగ్రహానికి ఆర్ఎఒ ఆర్ మునిస్వామి, ఎస్పి రఘునాయిగన్‌లు పూలమాలలతో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఖండవల్లి రామకష్ణ, మద్దింశెట్టి జియన్న, కెఎల్ వి ప్రసాద్, చెక్కల అరుణ్ కుమార్, సీతారామరాజు పాల్గొన్నారు.

ధవళేశ్వరం-యానాం పంపింగ్ స్కీమ్‌కు మరమ్మతులు

ధవళేశ్వరం గోదావరి నుంచి యానాం వరకు సుమారు 64 కిలోమీటర్లమేర సుమారు రూ.54కోట్ల స్కీమ్ తో పాటు తాగునీటి పైపులైను గతంలో నిర్మాణం చేశారని అయితే నీరు వ్యయంతో పంపింగ్ మాత్రం రాకపోవడంతో పంపింగ్ స్కీమ్ వద్ద మరమ్మతు పనులు చేపట్టడానికి పూడికను తొలగించడానికి పుదుచ్చేరి చీఫ్ ఇంజినీరుతో మాట్లాడినట్లు ఎంఎల్ఎ అశోక్ తెలిపారు. దీంతో ధవళేశ్వరం వద్ద పనులు చేయడానికి కార్మికులను ఏర్పాటు చేసుకోవడానికి నిర్ణయించినట్లు తెలిపారు. పంపింగ్ స్కీమ్ ప్రారంభమైతే మూడు క్యూసెక్కుల చొప్పున నీటిని తరలించడానికి మార్గం సులభమవుతుందన్నారు.


ఇఫ్తార్ విందులో ఎంఎల్ఎ అశోక్

ముస్లిములకు ఎంఎల్ఎ అశోక్ ఇఫ్తార్ విందు

యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ శనివారం జామియా మసీదులో ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటుచేశారు. ముస్లింలు ఆర్థికంగా అభివద్ధి చెందడానికి యువతకు ప్రభుత్వ పథకాలను అమలుచేస్తామన్నారు. కార్యక్రమంలో ఇమామ్ ఎమ్ ఎల్తాన్, మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ మహ్మద్ తాజుద్దీన్ భాషా, కరీమ్, జిలానీ, రిజ్వాన్, సుభహానీ, మొహమ్మద్ ఫిరోజ్ బిస్మిల్లా యూత్ సభ్యులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందించిన ఎంఎల్ఎ అశోక్

క్రికెట్ విజేతలకు బహుమతులు

దరియాలతిప్పలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు యానాం ఐ ఆర్ బి టీం, ఫరం పేట టీమ్లు ఫైనల్ కు చేరుకుని పోటీ పడగా ఫరంపేట టీమ్ విజయం సాధించింది. ఈ సందర్భంగా విజేతలకు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ బహుమతులు అందజేశారు. ఈ టోర్నమెంట్‌కు కన్నీడి నాగార్జున, క్స్, రేవు వరుణ్, గెడ్డం రాజబాబు ,కొప్పిరెడ్డి రాజు, కన్నీడి నవీన్, జగడం ధర్మారావులు నిర్వాహకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో కాకి నాగేశ్వరరావు, ములపర్తి అప్పారావు, కొల్లు నూకాంభరం పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

యానాం పట్టణ పరిధిలోని స్థానిక కురసంపేటలో ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఎఒ మునిస్వామి శనివారం రూ.5 లక్షల విలువచేసే 100 కె వి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ను ప్రారంభించారు. దీనిపై ఎంఎల్ఎ అశోక్, విద్యుత్ శాఖ జెఇ మూర్తి,ఎఇ లంక కష్ణారావు, సిబ్బందికి గ్రామ ప్రజలు కతజ్ఞతలు తెలియజేశారు.

సెగలు.. పొగలు..

గోదారి గలగలలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఒక వైపు ఎండలు సెగలు పుట్టిస్తుంటే మరో వైపు రాజకీయ పరిణామాలు పొలిటికల్ హీట్‌ను పెంచుతున్నాయి. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం, సిపిఐలు ఐక్యంగా సమరశంఖారావం పూరించాయి. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఆ పార్టీ శ్రేణులు ప్రారంభించిన 'ప్రచారభేరి'కి విశేష ఆదరణ లభిస్తోంది. ఈ యాత్రలో బిజెపి అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, మోదీ సర్కారు తీసుకొస్తున్న మత విద్వేషాలు, దేశ సంపదను కార్పొరేట్‌లకు కట్టబెట్టేందుకు అనుసరిస్తున్న విధానాలను ప్రజలు వివరిస్తున్నారు. విశాఖ ఉక్కు పోరాటం ప్రారంభించి 700 రోజులు పూర్తయిన విషయం విధితమే. ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వ పెద్దలు పూటకో మాట మాట్లాడుతూ ప్రజలను మభ్య పెట్టేందుకు యత్నిస్తున్నారు. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి చట్టసభల్లో ప్రశ్నించిన దాఖలాలు లేవు. అంధ్ర ప్రదేశ్ అభివృద్ధిలో కీలకమైన పోలవరం ప్రాజెక్టు, ప్రత్యేక హోదా వంటి అంశాలపై కేంద్రాన్ని నిలదీయడంలోనూ ఆ రెండు పార్టీలు పూర్తిగా విఫలమయాయయి. బిజెపితో అంటకాగుతున్న జనసేనదీ అదేతీరు. ఈ పరిస్థితుల్లో వామపక్ష పార్టీలు పాదయాత్రను చేపట్టి ప్రజలను ఐక్యం చేసి హక్కులు సాధనకు పోరాటాల దిశగా కృషి చేస్తున్నాయి. దీనిలో భాగంగా ఈ నెల 28న రాజమహేంద్రవరంలో నిర్వహించబోయే బహిరంగ సభకు కార్యచరణ రూపొందించాయి. ప్రజల భాగస్వామ్యాన్ని కూడగట్టి కేంద్రానికి హెచ్చరిక చేసేందుకు సిద్ధమవుతున్నాయి.

టిడిపి మహానాడుకు కసరత్తు

తూర్పుగోదావరి జిల్లా నుంచే టిడిపి ఎన్నికల శంఖారావం పూరించేందుకుద సిద్ధమవుతోంది. రాష్ట్ర రాజకీయాల్లో జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. ఈ నేపథ్యంలోనే మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాలతో పాటు మహానాడును సైతం రాజమహేంద్రవరంలో నిర్వహించేందుకు ఆ పార్టీ అధినాయకత్వం సమాయత్తమవుతోంది. దీంతో ఆ పార్టీ సీనియర్ నేత, రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాహానాడు స్థలాన్ని పరిశీలించే ప్రక్రియ ప్రారంభించారు. ప్రభుత్వం అడ్డంకులు సృష్టించినా సుమారు 10 లక్షల మందితో సభ నిర్వహిస్తామని అంటున్నారు. ఎన్‌టిఆర్ పేరుతో కేంద్రం నాణేన్ని విడుదల చేయటంతో ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీని ఆహ్వానిస్తారని సమాచారం. ఆంధ్రప్రదేశ్‌లో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపిలకు సొంత ప్రయోజనాల కోసం బిజెపిని ప్రశ్నించటంలేదనే భారాసా చేసిన విమర్శలకు మరింత బలాన్ని చేకూర్చుతోంది. మొత్తం మీద ఈ మహానాడుతో గత వైభవం సాధ్యమా..? అనే సందేహమూ వెంటాడుతోంది. జిల్లాలోని అన్ని నియోజక వర్గాల్లో తెలుగుదేశం పార్టీ గ్రూపులుగా చీలిపోయిన విషయం విధితమే. ఇటీవల 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' కార్యక్రమానికి హాజరైన అధినేత చంద్రబాబు సైతం సభాముఖంగానే క్రమశిక్షణే గీటురాయి అని తేల్చి చెప్పారు. మొత్తం మీద ఈ సభ ఆపార్టీకి ఎంత మేరకు కలిసి వస్తుందో వేచి చూడాల్సి ఉంది.

భానుని భగభగలు

జిల్లాలో భానుడు భగ భగలు రోజురోజుకూ అధికమవుతుండటంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఏప్రిల్ నెలలోనే ఇలా ఉంటే మేలో ఎండలు మరింత తీవ్రతరం కానున్నాయి. ఈ వారంలో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైగా నమోదయ్యాయి. రాజమహేంద్రవరంలో అత్యధికంగా 43 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైన విషయం విధితమే. దీంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు రావాలంటేనే సందేహిస్తున్నారు. సాయం త్రం 4 గంటల వరకూ ప్రధాన కూడళ్లు సైతం ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

ఐపిఎల్ బెట్టింగ్ జోరు...

పోలీసుల పర్యవేక్షణ ఉన్నప్పటికీ జూదరులకు అడ్డుకట్ట పడటం లేదు. ఐపిఎల్ మ్యాచ్‌లు క్రీడా అభిమానులకు వినోదం పంచుతున్నాయి. ఆ వినోదాన్ని కొందరు ఖద్దరు బాబులు సొమ్ములు చేసుకునే పనిలో పడ్డారు. నూతన సాంకేతికను ఉపయోగించి యువతకు ఎర వేస్తున్నారు. బెట్టింగ్ యాప్‌ల ద్వారా బెట్టింగ్‌లు నిర్వహిస్తూ జేబులు గుల్ల చేస్తున్నారు. ఎక్కువగా యువత బెట్టింగ్ మోజులో పడి జీవితాలను నాసనం చేసుకుంటున్నాయి. ఈజీ మనీ పేరుతో బెట్టింగుల్లో డబ్బులు పోగొట్టుకుని చివరకు అప్పుల పాలవుతున్నారు. ఐపిఎల్ నేపథ్యంలో జిల్లాలో రోజుకు రూ.2కోట్లకు పైగా బెట్టింగ్‌లో చేతులు మారుతున్నట్లు అంచనా. పోలీసు అధికారులు మరింత నిఘా పెట్టి కట్టుదిట్టమైనచర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

వైసిపి నుంచి టిడిపిలోకి ముదునూరి


వరుపుల సత్యప్రభను కలిసిన వైసిపి నుంచి టిడిపిలోకిచేరిన ముదునూరి మురళీ కృష్ణరాజు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రత్తిపాడు నియోజకవర్గంలో నియోజకవర్గంలో ఎదురులేని నాయకుడుగా ఉంటూ వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, డిసిసిబి డైరెక్టర్ ముదునూరి మురళీకృష్ణ రాజు శనివారం తన అనుచరులతో టిడిపిలో చేరారు. ఇప్పటికే అధికార పార్టీకి చెందిన ఏలేశ్వరం, రౌతులపూడి ఎంపీపీలు గొల్లపల్లి బుజ్జి, గంటుమల్ల రాజ్యలక్ష్మి, ప్రతిపాడు జడ్పిటిసి బెహరా రాజరాజేశ్వరి అసంతప్తితో శాసనసభ్యునికి వ్యతిరేక వర్గంగా ఏర్పడి తలనొప్పిగా తయార య్యారు. ఇటు వంటి తరుణంలో మురళీకష్ణ రాజు పార్టీని విడిపోవడం నియోజక వర్గంలో పార్టీకి తీవ్ర నష్ట మని విశ్లేషకులు భావిస్తు న్నారు. తెలుగు దేశంలో చేరిన వారిలో మరో ముఖ్య నాయకుడు అన్నవరం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు, మాజీ సర్పంచ్ బుద్ధరాజు గోపిరాజు, జల్లిగంపల ప్రభాకర్ ఉన్నారు. వీరు పిఠాపురం మాజీ ఎంఎల్ఎ ఎంవివిఎస్ వర్మ, యనమల కృష్ణుడు సమక్షంలో రాష్ట్ర కార్యాలయంలో చంద్రబాబు నాయుడుని కలిసి పార్టీలో చేరారు. చంద్రబాబు టిడిపి కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం తన అనుచరులతో కలిసి ప్రతిపాడు చేరుకుని నియోజకవర్గ ఇన్చార్జ్ వరుపుల సత్యప్రభను మర్యాదపూర్వకంగా కలిశారు.

పెద్దాపురం బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం


పెద్దాపురం బార్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఎన్నికల అధికారులు సాదే నరసింహారావు, సారా రామచంద్రరావు, తాండ్రోతు నూకరాజుల పర్యవేక్షణలో శనివారం బార్ అసోసియేషన్ నూతన కమిటీ ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. నూతన అధ్యక్షునిగా వేదుల సుబ్రహ్మణ్యం (మణి), జనరల్ సెక్రటరీగా కందుల నరేష్ కుమార్, ఉపాధ్యక్షులుగా చొక్కాకుల రవిబాబు, కోశాధికారిగా దేవునిపల్లి రవి కుమార్, సహాయ కార్యదర్శిగా మడికి రాంబాబు, గ్రంథాలయ సెక్రటరీగా రాగం కామేశ్వరరావు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా శిలపరశెట్టి విశాలాక్షి, మహిళా రిప్రజెంటేటివ్‌గా బొర్రా విజయలక్ష్మి, సీని యర్ ఎగ్జిక్యూటివ్ సభ్యు లుగా అవసరాల వెంకట జనార్ధనం, దేవులపల్లి రామ చంద్రరావు, పిట్ల రమణ, సుకురు దుర్గారావు, జూనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా జమ్మి వెంకట కృష్ణారావు, కొండ్రు సతీష్,కాపవరపు సూర్యప్రభ లు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సీనియర్ న్యాయవాదులు గన్నంరాజు సత్యనారాయణ, జివిఎస్ నారాయణ, రాయుడు, కృష్ణారావు, ఏపిపి మత్యం జయరావు, ఎజిపి ఎం. సోమరాజు అభినందించారు.

అధికారుల తీరుపై సర్పంచ్ ఆగ్రహం


ఎస్ఆర్ పేటలో ఇంద్రమ్మ కాలనీలో మట్టితో మూసేసిన ప్రధాన డ్రెయినేజి

ప్రజాశక్తి - కోటనందూరు

గ్రామం మధ్యలో ఉన్న ప్రధాన డ్రెయినేజీని మట్టితో పూడ్చి వేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఆర్ పేట గ్రామ సర్పంచ్ రుత్తల రాజేశ్వరి ఎంపిడిఒ, ఇతర అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఆర్ పేట గ్రామంలో ఇంద్రమ్మ కాలనీలో ఉన్న డ్రెయినేజీ ద్వారా వెళ్లే మురుగు నీరు వెళ్లకుండా ఒక వ్యక్తి మట్టితో కప్పి వేశారన్నారు. కాలనీవాసులు డ్రెయినేజీ మూసి వేయడం వల్ల మురుగునీరు పోయే మార్గం లేక అక్కడే నిల్వ దుర్వాసన వెదజల్లడం, దోమలు , ఈగలు వ్యాప్తి చెందడంతో తమ అనారోగ్యాల ారిన పడుతున్నామని కాలనీవాసులు సర్పంచ్ దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై సమస్యను పరిష్కరించాలని అధికారులకు తెలిపినప్పటికీ పట్టించుకోక పోవడంపై అధికారుల తీరుపై సర్పంచ్ రాజేశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆదిత్య పాలిటెక్నిక్ ఆన్‌లైన్‌లో పాలీసెట్ ప్రవేశానికి ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి మండలం సూరంపాలెం, రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ నిర్వహించే పాలీసెట్ 2023 ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆన్‌లైన్ మాధ్యమంలో ఉచిత శిక్షణా తరగతులు ఈ నెల 17వ తేదీ నుండి ప్రారంభం అవుతు న్నట్లు ఆదిత్య కళాశాలల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమల్లి సతీష్ రెడ్డి తెలియజేశారు. వేయి మందికి పైగా విద్యార్థులు ఈ క్లాసులకు హాజరు కావడానికి ఇప్పటికే రిజిస్టర్ అయ్యారని, ఇంకా ఆసక్తి కల విద్యార్థులు తమ పాలిటెక్నిక్ వెబ్‌సైట్ www.polytechnic.aec.edu.in కి లాగిన్ అయ్యి రిజిస్టర్ అవ్వవచ్చని తెలియజేశారు. ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్ ఎస్‌టివివిఎస్ కుమార్ మాట్లాడుతూ మే నెల 10న జరిగే పాలీసెట్ ప్రవేశ పరీక్షకు హాజరు అయ్యే విద్యార్థులు ఈ నెల 30వ తేదీ లోగ దరఖాస్తు చేసుకోవాలని ఇందుకోసం పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ, రాజమండ్రీ, గొల్లల మామిడాడలలో గల ఆదిత్య విద్యా సంస్థలలో పోలిసెట్ ఆన్లైన్ అప్లికేషన్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశామని, వివరాలకుః 8498053404, 9505518249, 9505518255 నెంబర్లకు సంప్రదిం చాలని తెలియజేశారు. సమావేశంలో డైరెక్టర్ డాక్టర్ ఎం శ్రీనివాసరెడ్డి, పాలిటెక్నిక్ కళాశాలల డీన్ ఎ వి మాధవరావు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - కాజులూరు

గృహ నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీవో సిహెచ్ ఇందిరాదేవి కోరారు. శనివారం మండలంలోని మంజేరు చేదువాడ గ్రామాలలో గ్రామసభలు, గృహ నిర్మాణంపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఒక్కరు ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలి దీనికి లబ్ధిదారులకు కావలసిన సౌకర్యాలను అధికారులు కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్లు గుంటూరు అప్పారావు, గంజా దేవి సూరిబాబు పంచాయతీ కార్యదర్శి రాజ్ కుమార్, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యవర్గ సభ్యులు, వాలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

శృంగార వల్లభ స్వామికి రూ.3.80 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

తిరుపతిలోని శృంగార వల్లభ స్వామి ఆలయాన్ని శనివారం అధిక సంఖ్యలో యాత్రికులు దర్శించుకు న్నారని ఆలయ ఇఒ పులి నారాయణమూర్తి తెలిపారు. శనివారం ఒకరోజు వివిధ టిక్కెట్ల ద్వారా రూ3,20,770,అన్నదాన విరాళాల ద్వారా రూ 49,770,కేశఖండన ద్వారా రూ 9,500 ఆదాయం సంకురిందన్నారు. యాత్రికులక అన్నదానం నిర్వహించామన్నారు. పెద్దాపురంలోని లక్ష్మీ షాపింగ్ మాల్స్ ఆధ్వరంలో చలివేంద్రం ఏర్పాటుచేసి యాత్రికులకు మజ్జిగ పంపిణీ చేశారన్నారు. ప్రజా ప్రతినిధులు కుంచే బుచ్చిరాజు,కర్రి జగదీష్,ఆలయ సిబ్బంది కృష్ణ, స్వచ్ఛంద సేవకులు సహకారాలు అందించారు అన్నారు.

కొబ్బరి చెట్లను పేదలకు పంచాలని డిమాండ్

ప్రజాశక్తి-ఐ.పోలవరం

భూస్వాములకు చెందిన ఉన్న కొబ్బరి చెట్లను పేదలకు పంచాలని సామాజిక కార్యకర్త బీర సత్యనారాయణ డిమాండ్‌చేశారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎదుర్లంక రేవు మొదలు కొని సఖినేటిపల్లి రేవు వరకు రోడ్ల ఇరువైపులా పంచాయతీ, ఆర్అండ్‌బి రోడ్లు, కాలువగట్లు, చెరువుగట్లు, పోరంబోకు భూముల్లో కొబ్బరి చెట్లు భూస్వాములు చేతుల్లో ఉన్నాయని వాటిని పేదవ్యవసాయ కూలీలకు పంచాలన్నారు. 99సంవత్సరాలు లీజు పేరుతో అనేకు ఏళ్లుగా కొబ్బరి చెట్లను కొన్ని భూస్వాముల కుటుంబాలు ఫలసాయాన్ని తీసుకుంటున్నారని అన్నారు. భూమిలేని నిరు పేదల వ్యవసాయ కూలీ కుటుంబాలకు వీటిని పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి ఒక రూపాయి కూడా భూస్వామ్య కుటుంబాలు చెల్లించడంలేదన్నారు. తక్షణమే కొబ్బరి చెట్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలని లేనిపక్షంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులకు మద్దతుతో ఆందోళన చేపడతామన్నారు.

రూ.2 కోట్ల 32 లక్షలతో జి.వేమవరం అభివృద్ధి



జి.వేమవరం గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ సూరిబాబు

ప్రజాశక్తి - తాళ్లరేవు

గ్రామాభివృద్ధి కోసం పంచాయతీ, ప్రభుత్వ నిధుల నుంచి రూ. రెండు కోట్ల 32 లక్షలతో జి.వేమవరం పంచాయతీలో ఈ ఏడాది పలు గ్రామాభివృద్ధి పనులు చేపట్టినట్లు సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు తెలిపారు. పంచాయతీ వద్ద శనివారం జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రెండో విడత గృహ లబ్ధిదారుల పేర్లను సేకరిస్తుందని, ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ నుంచి ఒక్కో గృహానికి రూ.1,80,000, డ్వాక్రా రుణంగా రూ.30,000 అందుతుందని తెలిపారు. ఈ గ్రామ సభలో ఇఒపిఆర్‌డి మల్లాడి భైరవమూర్తి మాట్లాడారు. ప్రస్తుత వేసవిలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి సుధారాణి, ఎంపిటిసి ఎర్రం నీడి అప్పారావు, ఫీల్డ్ అసిస్టెంట్ డి. సత్యనారాయణ, ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. సచివాలయ సిబ్బంది వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పలు వార్డుల్లో మా నమ్మకం నువ్వే జగనన్న

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం పట్టణంలోని పలు వార్డులలో ఆయా వార్డుల కౌన్సిలర్లు,వైసీపీ నాయకులు ఆధ్వర్యంలో శనివారం మా నమ్మకం నువ్వే జగనన్న నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్లు నీలంశెట్టి అమ్మాజీ,విజ్జపు రాజశేఖర్,కాపుగంటి సౌందర్య లక్ష్మి,తస్లీకి సత్యభాస్కరరావు,కో ఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ,వైసిపి నాయకులు ముమ్మన ప్రకాశం, వీరేశ్వరపు ఏసుబాబు,శ్రీను, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

రంగాపురంలో గత రాత్రి అగ్ని ప్రమాదానికి గురై సర్వం కోల్పోయిన సత్తాల నక్షత్రం కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని జెడ్‌పిటిసి సభ్యుడు పందిరి శ్రీహరి రామ్ గోపాల్ పేర్కొన్నారు. శనివారం సత్తాల నక్షత్రం కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి కొంత నగదును, అమలాపురం మండల పరిషత్ అధ్యక్షురాలు కుడిపూడి భాగ్యలక్ష్మి బాబు వంట సామగ్రి, రాష్ట్ర బిసి డైరెక్టర్ కరెళ్ల రమేశ్ బాబు దుస్తులను బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కుటుంబాన్ని పరామర్శించిన వారిలో అమలాపురం మండల కో ఆప్షన్ సభ్యుడు మొసలి స్వర్జన్ రాజు, సమనస ఎంపిటిసి ఉడుము రామకృష్ణ, వీఆర్వో గణపతి, అక్కిశెట్టి ప్రసాద్, ఉడుము బాలరాజు తదితరులు ఉన్నారు.

మామిడికుదురు పాశర్లపూడి బాడవలో శుక్రవారం అర్థరాత్రి వేగి లక్ష్మీ నారాయణ మూడు అంతస్తుల కొబ్బరి గొడాన్ అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.30 లక్షల కొబ్బరి కాయలు, 15 టన్నుల కొబ్బరి ఈనెలు దగ్ధమైయ్యాయి. సుమారు రూ.60 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. జిల్లా జెడ్పి మాజీ చైర్మన్, నామన రాంబాబు, మొల్లేటి శ్రీనివాస్, బోణం బాబు,మద్దాల నాగబాబు తదితరులు శనివారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడుని పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు.

లో ఓల్టేజ్ సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - గండేపల్లి

ఉప్పలపాడు గ్రామంలో బిసి, ఎస్ సి పేటలో చాలాకాలంగా విద్యుత్ సమస్య ఉందని కాలనీవాసులు సర్పంచ్ అడబాల రామాంజనేయులకు తెలియజేశారు. విద్యుత్ లో ఓల్టేజి సమస్య గురించి స్థానిక ఎంఎల్ఎ జ్యోతుల చంటి బాబుకు తెలియజేయగా ఆయన వెంటనే స్పందించి విద్యుత్ అధికారులకు తెలియజేశారు. విద్యుత్ అధికారులు 40 కెవి 3 ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అందజేశారు. శనివారం విద్యుత్ సిబ్బంది వైర్లు లాగి ట్రాన్స్ఫారం అమర్చారు. ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబుకు, సర్పంచ్ అడబాల రామాంజనేయులు కు, విద్యుత్ సిబ్బందికి కాలనీవాసులు ధన్యవాదాలు తెలియజేశారు